# అనుభూతి

రచన :

శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ.

***

సృష్టిలోని కష్టసుఖాలు
మొండితనంతో పోరాడి
అగ్నిపర్వతాల నెల్ల
గుండెల్లో దాచుకొని
కన్నీళ్ళతో ఆర్పుకొంటు
జీవయాత్ర చేయు వారినెల్ల;
సముద్రాలు పొంగినా
గాలీ వానలో కొట్టుకు పోయినా
ఆలుబిడ్డలు అంతరించినా
ఆశలు చావక బ్రతికే జీవులగాథ;
పేదల గుండెలలో రగిలే
అకలి జ్వాలల అనంత వేదన,
మానవ అసమానపు తిమి
రావళి సమరము జేసెడి
హీనులగు దీనజనుల
హృదయము లోపలి ఆవేదన;
కలవారిలో వుండె కర్కశత్వం
దీనమానవుల ఆర్తనాదం
బాహ్యలోక నటన కంటె
అంతరాత్మ ప్రబోధంతో
నీతి నిజాయితీ నిర్మలహృదయంతో
స్వార్థంలేని నిస్వార్థ జీవులగాథ;
కవిత మహా సంద్రములో
నిరాటంకముగా నావ నెక్కి
నవమార్గపు నలుగెడలను పయనిస్తూ
అనుభూతిని పొందుతు నే రచియిస్తా.

# దండుగ అయిన పండుగ

రచన :

'ఎన్నార్ లక్ష్మి'

"ఒరేయ్! ప్రకాశూ! రేపొచ్చే సంక్రాంతి నీకు మొదటి పండగ కదూ! కొత్త మావగార్ని ఏం బహుమతి అడగదల్చుకున్నావ్?" అక్కయ్యని పురిటి కనిదిగబెట్టి వెళ్ళాదామని వచ్చిన బావ అలా అడగ్గానే, నా వీపు చరిచినట్లయి, నిద్రలోంచి మేల్కొన్నట్లు అతనికేసి చూశాను అదోలా!...

నాకు పెళ్లయిన సంగతీ; ఆ వచ్చేది నాకు కొత్త పండుగన్న సంగతీ, అత్తారిని కొత్తవస్తు వేదైనా కోరా లన్న సంగతీ. వాళ్లొకవేళ అడిగినది యివ్వలేనంటే, బిగిసి, పండుగకు వెళ్లడం మానేసి, కోపగించాలన్న సంగతీ,—సవిస్తరంగా బావ నూరిపోశాడు! - అతడు మా నాన్ననో ఊపుఊపి, అనుభవం సంపాదించిన వాడే! అందుకే అతని శిష్యత్వం ... ఆనంధించాను!-

ఇక ఆలోచించడం మొదలుపెట్టాను! జనవరి 1 వ తారీఖు ఆరోజు! ఆనాటికి ఆ ప్రోజులైంది బావ నాలో ఆశ లేపిపోయి! నామనసును వేధించేది ఏమిటి అడగాలా అన్నదే!...'మోటారు సైకిలు!' అబ్బ అంత ఆశ కూడదు! కాకపోయినా అది ప్రమాదం కూడా!... పోనీ మామూలు సైకిలైతే? - బాగానే ఉంటుంది! కాని, వెధవది ఏకం పెనీ మంచిదో తెలియదు కదా!- అసలంటూ ఇస్తే, ఏదైతే ఏంలెద్దూ! - అవి సరేకాని, సైకిలు వచ్చింది అంటే, నిరుద్యోగినైన నాకు, నిత్యం త్రిప్పటెక్క పోతుంది. సోమరితనం అబ్బుతుంది! కాకపోయినా అందరూ ఎరువు అడుగుతూ ఉంటారు! చూసిచూసి యివ్వననలేనూ! వద్దుబాబూ!...అడగా లన్న సంగతే చెవినేసిపోయాడు కాని, కాస్త ఏం అడగాలో కూడా చెప్పవయ్యా అంటే, "నీ యిష్టం!" అన్నాడు బావ!

తిరిగి రెండునిముషాలు బుర్ర హీటెక్కేలా ఆలోచించాను!... "హమ్మయ్య!" అనుకుని ఓ నిర్ణయాని కొచ్చాను!

అసలింతకీ ఆ మావగారనే వ్యక్తి వచ్చి పిలుస్తే కదా నాకు అడిగే శ్రమా! ఆయనకిచ్చే బాధను! 'పిలుస్తారా? పిలవరా?' అన్న ఆలోచనా, అనుమానాలని అంతం చేస్తూ, ఆరాత్రికే దిగారు మావగారు! ఆ ఉన్నిపెళ్లి

తర్వాత ఇదే తిరిగి చూడడం!' 'ఎంత మారిపోయారూ! అనుకున్నాను! ఆయన ముడతలుపడ్డముఖం దీనంగా కనిపించింది నాకు! ఆయనముఖంలోకి జాలితో, సూటిగా చూశాను! ఆముఖంలో నా శ్రీమతి ప్రతిబింబించి, నామతి పోగొట్టింది!...''అబ్బా! ఎంత మారిపోయావు శ్రీమతీ! ఇంత అందంగా తయారవుతావని పెళ్లిచూపులు నాడు ఊహించనైనా లేదే!' ఒక్కసారి తన్మయత్వంలో కళ్లు మూశాను! తిరిగి చూసేసరికి ముసలినవ్వుతో మాట్లాడుతున్న మావగారు కనిపించారు ఆయనేదో చెప్పుకుపోతున్నారు! కాని... నేను అక్కడుంటేగా! - ''ఎలాగయినా శ్రీమతిని చూడ్డానికయినా ఈ పండుగకి వెళ్లాలి!'' ఆలోచిస్తూనే, ఆయన ''పండుక్కి తప్పకుండా రావాలోయ్!'' అన్నమాటలకి, అప్రయత్నంగానే ఓ! తప్పకుండా!'' అనేశాను!

కాని పండుగ బహుమతి అడగాలని మనసుపీకింది! బెడ్డవేద్దాం! తగుల్తుందా సరేసరి... లేకపోతే, పోనీ!... అని. ముఖం కొంచెం సీరియస్‌గా పెట్టి, 'పండుగ బహుమతి 'వాచి' యిస్తేనే వస్తానండి!'' అనేశాను!— అమాత్రం అయన నవ్వేసారు!'' అదేమిటోయ్! మొదటి పండుక్కి నువ్వడగాలా? నాకు తెలియదూ! మొన్ననే కొనిపెట్టాను ఒకరిష్టువాచీ! మరోటికాకుండా, సరిగా నువ్వూ అదే అడిగావు అదృష్టవశాత్తూ!'' ఆయనకేసి ఆశ్చర్యంతో అలానే చూస్తూవుండి పోయాను!

ఉత్సాహోద్రేకాలు ఉప్పొంగి, అలాటి ఆనందానుభూతి పొందిన తొలిదినం అదే నాకు! తొలీపండుగకు అత్తగారింటికి బయల్దేరిన రోజు! ...రైలుదిగి, జిప్ బేగ్‌తో రిక్షా ఎక్కాను! ఎక్కడికో చెప్పడం మరిచి ఏదో ఆలోచిస్తున్న నన్ను, మైలుముందుకు పోయాక అడిగాడు, ''ఎక్కడికిసార్?'' అని రిక్షావలా! ఓసారి చుట్టూ చూసి, ''ఇదేమిటోయ్! యింతదూరం తీసుకొచ్చావ్? గవర్నమెంటు హాస్పిటలు దగ్గిరయ్యా!'' అన్నాను! వాడుకొంచెం విసుక్కుంటూన్నా వినిపించుకోకుండా!'' వెనక్కిపోనీయ్!'' అన్నాను!

''పావలా ఎక్స్‌ట్రా అవుతుందిసార్!'' అన్నాడు. ఆనందంలో, ఆతృతలో ఉన్న నాకొకలెఖ్ఖా అది! ''సరేపోనీయ్!'' అన్నాను! ఖంగారుగా!

రిక్షాదిగి తలుపు తట్టాను!...గాజుల శబ్దం!...వస్తున్నట్లు అలికిడి! ...మరుక్షణంలో కిటికిచువ్వల ఆవల కాటుకతో మరింత విశాలమయిన కలువరేకుల్లాటి నేత్రదయం బయటకు తొంగిచూస్తూ కనబడింది! తలుపు తెరుచుకుంది!...తలసిగ్గుతో వంచుకుంది నా శ్రీమతి!

మూర్ఛపోయినంత పనైందినాకు! చేతిలో బేగ్ అప్రయత్నంగా జారి నేలమీద నిలిచింది! వంగి, బేగ్ తీసుకుని వయ్యారంగా నడుస్తూ, గదిలోకి నిష్క్రమించిన శ్రీమతినే చూస్తూ, రెప్పవెయ్యడం కూడా మర్చిపోయాను, రేగినతీయని తలపుల తూగుటుయ్యాలలో తూగుతూ, ఊగుతూ, లోకంమరిచిన నాకు అత్తగారి మెత్తనిపిలుపు తత్తరపాటు కలిగించింది!...ఖంగారుపడి, సర్దుకుని, సావిడిలోకినడిచాను!

భోగిరోజు భోగాలన్నీ పూర్తయాయి!—పెద్దపండుగ ప్రవేశించి!-నాలో నిరుత్సాహం నిండింది! 'పుణ్యకాలంలో రెండోరోజు కూడా అయిపోతోందే!'— అన్నదే నా విచారం!

పెద్ద పండుగనాటి మధ్యాహ్నం, పెట్టుబడులూ జరుగుతాయి!—నన్ను కూడా పెద్దగా సన్మానించారు!—'రిస్టువాచీ' నాచేతి నలంకరించబడింది! తళతళ మెరిసే 'వాచి' చూసుకుని తన్మయుడయ్యాను.

బట్టలు బనాయించి, రిస్టువాచీ తగిలించుకుని సాయంత్రం గం 4-00 లకు బజారుకు బయల్దేరాను.

తరచువాచీని గర్వంగా చూసుకుంటూ, తరలిపోయే నా భుజాన్ని తటాలున తట్టారెవరో!—నేను తిరిగాను ఆగి! నల్లటిపాంటు, తెల్లటి చొక్కాలవెనక, నల్లటి తుమ్మమొద్దులాటి శరీరం! బొద్దు మీసాలూ!—ఎవరో ఓ అపరిచితవ్యక్తి, నా వాచీ చేతికేసి అదేపనిగా చూస్తున్నా .!

'ఏం కావాలి మీకు?' అడిగాను!

'ఈ వాచీ ఎంతకి కొన్నారు?'

'నూటముప్ఫయ్యి!' గర్వంగా అనేసి, వాచి నోసారి చూసుకున్నాను!

'కొత్తదేనా?' అడిగాడు తిరిగి.

కోపంతో చూశాను చురచురా!

'ఆఁ!...నిన్ననే కొన్నా!' అన్నాను గట్టిగా!

'ఓహో! అలాగా!...ఎక్కడ కొన్నారు?'—

నాకు కొంచెం విసుగే వచ్చింది!—అయినా కనబడనీయకండా, 'ఇంతకీ మీ రెవరో చెప్పలేదు!' అన్నాను.

ఆయన చిన్నగా నవ్వి జేబులోకి చెయ్యి పోనిచ్చాడు!

అప్పుడే చీకటి పడిపోయింది!—

స్ట్రీట్ లైట్ వెలుగులో ఆయనచేతిలో ఫోటో చూశాను! ఆఫీసరు దుస్తులలో ఉన్న ఆయనదే ఆ ఫోటో!

నా కేమీ అర్థం కాలేదన్నట్లు చూశా!

'మిస్టర్! మీ చేతివాచీ దొంగవాచీ!' అన్నాడు!-

నేను పగలబడి నవ్వాను!—నవ్వాపుకుని,

'నేనెక్కడా దొబ్బలేదండీ?' అన్నాను.

'అది కాదు మిత్రమా! ఇది టాక్సు కట్టకండా దొంగతనంగా తీసుకొచ్చి అమ్ముతున్న బాపతు! ఇది 'ఫెఫారా కంపెనీది! ఖరీదు రు. 61-లకి అమ్ముతున్నారు. దీని అసలు వెల రు. 150/-లు ఇలాటి దొంగవాచీలు పట్టుకుందుకు మమ్మల్ని నియమించారు.

ఇప్పుడు మీమీద కేసు పెట్టబడుతుంది!'—ఆయన చెప్పినది వింటుంటే, చెమటలు పోశాయి!— అడిగాను భయంతో, 'బాబూ! వాచీ కావలస్తే యిచ్చేస్తాకాని, కేసుమాత్రం వద్దండి! కొత్తల్లుడికి అత్తారిచ్చినదీ వాచి!- దీన్ని నేను కొనలేదు! మా మావగారు కొన్నారు! ఆయన పేరు దండిభొట్ల దశరథావధాని; యిల్లు గవర్నమెంటు ఆఫీసు సందులో!... నామీదొద్దండి కేసు బాబూ!...' తడబాటుతో, ఏంచెపుతున్నానో నాకే తెలియని స్థితిలో వాగేశాను!

నా పరిస్థితి చూసి, ఆయన జాలిగా నవ్వాడు!— 'మీరు ఖంగారుపడకండి! ఇది పండగ బహుమతి అన్నమాట! వాచీకోసం అలిగితే, తక్కువలో వస్తోందని కొనిచ్చుంటారు!— నేను వదిలితే, మరొకళ్ళు పట్టుకుంటే, ఎలాగా అపాయమే! ఆ వాచీ తీసి యిలా యిచ్చి మీరు వెళ్ళిపొండి! ఏం ఫరవాలేదు!'

'మ...రి...కే—సు?'

'వాచీ తీసుకు వదిలేస్తున్నాగా, ఇలా తెండివాచీ.'

వణుకుతున్న చేతులో, వాచీ ఆయనచేతి కందించాను. వెనక్కి తిరక్కుండా గబగబా ముందుకు నడిచాను?

వాచీ చెయ్యి జేబులో పెట్టి, తెల్లవారితే నలుగురికీ తెలిసి నవ్వులపాలవుతానని భయపడి, జిప్ బేగ్ లో బట్టలు సర్దాను,

'అదేవిటోయ్. అంత అర్జంటు?' అన్నారు మావగారు.

'అర్జంటుగా రమ్మని టెలిగ్రాం వచ్చిందండి. వెంటనే వెళ్ళాల. వెళ్తొస్తా' అని అబద్దం ఆడుతూనే, వాళ్ళు యిక మాట్లాడే అవకాశం ఈయకండా, అధమం శ్రీమతి నేనా ఆఖరిసారి చూడకండా రోడ్డు చేరి, రిక్షాఎక్కి—'త్వరగా బస్ స్టాండుకు పోనియ్' అన్నాను,

నా మొదటి పండుగ యిలా దండుగ అయింది!- తలుచుకుంటే, యిప్పటికి నిటూర్పు బాధగా వేస్తుంది.

### 'మాయామోహిని'

లోగడ-'గాంధారి గర్వభంగం'-'వీరజగ్గడు' లాటి అత్యుత్తమ చిత్రాలను ఆంధ్ర ప్రజానీకానికి సమర్పించిన శ్రీ కృష్ణసాయి ఫిలింస్ వారు తృతీయ కానుకగా 'మాయామోహిని' అను మహోన్నత జానపద చిత్రాన్ని త్వరలో ఆంధ్రదేశమంతటా విడుదల చేయటానికై సర్వసన్నాహాలు చేస్తున్నారు, రమణీయమైన నృత్యాలు, వీనుల విందు సంగీతం, భయంకరమైన కత్తియుద్ధాలు, మంత్ర తంత్ర మాయాజాల దృశ్యాలతో కూడుకున్న ఈ చిత్రంలో-ఉదయకుమార్, హరిణి, జయశ్రీ, రాజశ్రీ, లీలావతి, నరసింహరాజు ప్రభృతులు నటించారు. మాటలు, పాటలు: అనిసెట్టి, సంగీతం: రాజన్ మరియు నాగేంద్ర దర్శకత్వం: హున్సూర్ కృష్ణమూర్తి. నిర్మాత: యర్రా అప్పారావు. 10-5-62 తేదీన ఈ చిత్రాన్ని సెన్సార్ చేశారు.

## అకాల మరణం

కాల ప్రభావం వల్ల, ఒక నెల క్రిందనే 'ఆంధ్రప్రభ'లో అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరుగా పనికి చేరిన శ్రీ. పి. సుబ్బారాయుడు ఇదేనెల 4వ తేది స్కూటర్ ఎక్కబోతూండగా ఒక మిలిటరిలారి వచ్చి కొట్టుకుని మరణించారు.

వివిధ రంగాలలో శ్రీ పి. సుబ్బరాయుడు గారిని తెలియనివారు లేరు. ఆ, నవ్వుముఖం, శాంత స్వభావమే, వారి జీవితంలో, ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా అధైర్యపడనీయ లేదు. దుర్దైవం వెంటాడి కసి తీర్చుకుంది. వారి ఆత్మకు భగవంతుడు శాంతి కలిగించాలని కోరుతూ, దుఃఖ సముద్రములో మునిగి యున్నవారి కుటుంబమునకు మా సానుభూతి తెలుపుకుంటున్నాము. ---సంపాదకు